## క్లుప్తంగా

### ప్రజల సహకారంతోనే కాలుష్య నియంత్రణ



ఆర్టీసీ బస్సులో జీవీఎంసీ కార్యాలయానికి చేరుకుంటున్న మేయర్ హరివెంకటకుమారి

దాబాగార్డెన్స్: విశాఖలో కాలుష్య నియంత్రణకు సహకరిస్తూ ప్రతి ఒక్కరూ వారంలో ఒక రోజు వ్యక్తిగత వాహనాలు విడనాడి ప్రజా రవాణా వినియోగించాలని నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి పిలుపునిచ్చారు. ఆమె సోమవారం తమ క్యాంపు కార్యాలయం నుంచి ఆర్టీసీ బస్సులో జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరంలో కాలుష్యం విపరీతంగా పెరుగుతున్న దృష్ట్యా కాలుష్య నియంత్రణకు ప్రజలు వారంలో ఒక రోజు వ్యక్తిగత వాహనాలు విడనాడి ప్రజా రవాణా ఉపయోగించాలని విజ్ఞప్తి చేశారు.

### ట్రాఫిక్ ఉల్లంఘనలపై కేసుల నమోదు



మద్దిలపాలెం కూడలిలో కేసులు నమోదు చేస్తున్న ట్రాఫిక్ సిబ్బంది

మద్దిలపాలెం: రోడ్డు నిబంధనలు అతిక్రమిస్తున్న ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లు నడిపే వారిపై ట్రాఫిక్ పోలీసులు ముమ్మరంగా కేసులు నమోదు చేస్తున్నారు. మద్దిలపాలెం కూడలి వద్ద ప్రతి రోజూ ఉదయం ట్రాఫిక్ పోలీసులు నిఘా పెట్టారు. హెల్మెట్ ధరించని వారు, ఖాకీ చొక్కా లేకుండా ఉండే ఆటో డ్రైవర్లు, సీట్‌బెల్ట్ లేకుండా కారు నడిపే వారిపై అక్కడికక్కడే కేసులు రాస్తూ, ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పిస్తున్నారు.

### ఈడీ దృష్టికి గ్యారేజీ ఉద్యోగుల సమస్యలు



ఏపీపీటీడీ ఈడీ చెంగలరెడ్డికి సమస్యలు వివరిస్తున్న ఎన్‌ఎంయూఏ ప్రతినిధులు

మద్దిలపాలెం: ఏపీపీటీడీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ టి.చెంగలరెడ్డి దృష్టికి గ్యారేజీ ఉద్యోగుల సమస్యలను తీసుకెళ్లి పరిష్కరించాలని కోరామని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరెడ్డి తెలిపారు. విజయవాడలోని కేంద్ర కార్యాలయంలో సోమవారం ఆయనను కలిసి సమస్యలు విన్నవించామన్నారు. వారికి అన్యాయంగా ఇస్తున్న పనిష్మెంట్‌ల గురించి వివరించామని చెప్పారు. దీనిపై ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు. ఈడీని కలిసిన వారిలో రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.రమణారెడ్డి, ఉపాధ్యక్షుడు శ్రీనివాసరాజు, కోశాధికారి పి.వి.వి.మోహన్, విజయవాడ జోనల్ కార్యదర్శి అడపా రామారావు పాల్గొన్నారు.

### 6న కులశేఖర్ సంస్మరణ సభ

మద్దిలపాలెం: నగరానికి చెందిన ప్రముఖ తెలుగు సినీ గేయ రచయిత కులశేఖర్ సంస్మరణ సభ ఈ నెల 6న విశాఖ పౌర గ్రంథాలయంలో నిర్వహించనున్నట్లు వైజాగ్ ఫిల్మ్ సొసైటీ కార్యదర్శి ఎస్.ప్రకాశరావు ఒక ప్రకటనలో తెలిపారు. సింహాచలంలో పుట్టి, బీవీకే డిగ్రీ కళాశాలలో ఆయన చదువుకున్నారన్నారు. వై.సత్యారావు మాస్టర్ ఆశీస్సులతో సినీ గేయ రచయితగా మారి అనేక చిత్రాలకు పాటలు రాసి కీర్తి గడించారని పేర్కొన్నారు. దురదృష్టవశాత్తూ అనారోగ్యంతో గత నెలలో హైదరాబాద్‌లో కులశేఖర్ మృతి చెందారన్నారు. శుక్రవారం సాయంత్రం 6 గంటలకు పౌర గ్రంథాలయం హాల్‌లో ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. మాస్టర్ వై.సత్యారావు, సహ విద్యార్థి, ప్రస్తుత రచయిత(సింహాచలం) లోగిస లక్ష్మినాయుడు తదితరులు పాల్గొని నివాళులర్పిస్తారని చెప్పారు. కులశేఖర్ మిత్రులు, బంధువులు, అభిమానులందరూ పాల్గొనాలని ఆయన కోరారు.



# ఏరి కోరి కూల్చివేతల్లో మతలబేంటి?

- అనధికార నిర్మాణాలపై జోన్–2 టౌన్‌ప్లానింగ్ అధికారుల పక్షపాత ధోరణి
- కొన్ని అక్రమ కట్టడాలపైనే చర్యలు
- స్థానికుల ఫిర్యాదులు పట్టించుకోని వైనం
- ఆరిలోవ నుంచి విశాలాక్షినగర్ వరకు ఇదే తీరు..

**ఆరిలోవ: జీవీఎంసీ జోన్–2 టౌన్ ప్లానింగ్ అధికారులు అనధికారిక నిర్మాణాలపై పక్షపాత ధోరణి కనబరుస్తున్నారు. అక్రమ కట్టడాలపై స్థానికులు ఫిర్యాదులు చేస్తున్నా.. కొన్నింటిని పట్టించుకోవడం లేదు. తూతూ మంత్రంగా కూల్చివేతలు చేపట్టి** మమా అనిపించేస్తున్నారు. కొన్ని అనధికార నిర్మాణాలపై వీరు చూపుతున్న ప్రేమకు స్థానికులు విస్తుపోతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి టీడీపీ నాయకులు అక్రమాలకు తెరతీశారు. రెవెన్యూ స్థలాలను సైతం ఆక్రమించి దర్జాగా నిర్మాణాలు చేపడుతున్నారు. అటు రెవెన్యూ అధికారులను.. ఇటు జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులను ఏకకాలంలో మేనేజ్ చేసేస్తున్నారు. ఆరిలోవ, పెదగదిలి, చినగదిలి, ఆదర్శనగర్, ఇందిరానగర్, విశాలాక్షినగర్ ప్రాంతాల్లో ఎక్కడ చూసినా ఇదే తంతు. ప్రతీ అనధికారిక భవన నిర్మాణం వెనుక ఎమ్మెల్యే ఒత్తిడి అధికారులపై ఉందని ఆరోపణలు వినిపిస్తున్నాయి.



ఇందిరానగర్‌లో అనధికార నిర్మాణాన్ని తొలగిస్తున్న జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ సిబ్బంది(ఫైల్)


**అనధికారిక అంతస్తుల తొలగింపు**

జీవీఎంసీ 10వ వార్డు ఇందిరానగర్‌లోని ఇరుకు రోడ్డులో నిర్మించిన అనధికారిక అంతస్తులను వారం కిందట జోన్–2 టౌన్ ప్లానింగ్ అధికారులు సిబ్బందితో కలిసి తొలగించారు. ఇక్కడ రామాలయం ఎదురుగా 8 అడుగుల వెడల్పు గల రోడ్డు పక్కన సుమారు 160 చదరపు గజాల విస్తీర్ణంలో ఓ వ్యక్తి దర్జాగా అనధికారిక అంతస్తులు నిర్మించేశాడు. అతడు టౌన్ ప్లానింగ్ అధికారుల నుంచి స్టిల్ట్, గ్రౌండ్, ఫస్ట్, సెకండ్ ఫ్లోర్లు వేయడానికి అనుమతులు తీసుకొని, మరో రెండు ఫ్లోర్లు అదనంగా వేశాడు. దానిపై ఫిర్యాదులు అందడంతో వారం కిందట టౌన్ ప్లానింగ్ అధికారులు అనధికారిక ఫ్లోర్లను తొలగించారు. అదే మాదిరి మరికొన్నింటిపై స్థానికులు ఫిర్యాదులు చేసినప్పటికీ వాటిని పట్టించుకోకుండా వదిలేయడంతో అధికారుల తీరుపై ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### వీటి జోలికి పోని అధికారులు

10వ వార్డు ఇందిరాగాంధీ నగర్ రామాలయం పక్క వీధిలోని సర్వే నంబర్ 111లో 2/312/1 డోర్ నంబర్‌తో ఓ వ్యక్తి రోడ్డును ఆనుకొని నిర్మాణం చేపట్టాడు. జీవీఎంసీ నుంచి తీసుకున్న అనుమతులకు మించి అదనంగా నాలుగో ఫ్లోర్ వేసే ప్రయత్నం చేస్తున్నాడు. భవనానికి ఎలాంటి సెట్‌బ్యాక్‌లు లేకుండా నిర్మించాడు. రోడ్డు పక్కన కాలువలను సైతం మూసేసి వాటి మీదకు సన్‌షేడ్లు వెచ్చేటట్లు నిర్మాణం చేపట్టాడు. దీంతో ఇక్కడ రోడ్డు ఇరుగ్గా మారింది. ఈ అనధికారిక నిర్మాణంపై స్థానికులు కలెక్టర్ హరేందిర ప్రసాద్, జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్‌లకు ఫిర్యాదు చేశారు. జోన్–2 టౌన్ ప్లానింగ్ అధికారులు తూతూ మంత్రం చర్యలతో ఈ అక్రమ నిర్మాణాన్ని విడిచిపెట్టేయడం విశేషం.

- ఇదే వార్డు ఆదర్శనగర్ కొండవాలులో కార్పొరేటర్ భర్త చేపడుతున్న అనధికారిక నిర్మాణం వైపు అధికారులు కన్నెత్తి కూడా చూడలేదు. సుమారు 250 చదరపు గజాల విస్తీర్ణంలో భవనం నిర్మిస్తున్నాడు. ఇది కొండవాలు కావడంతో ఈ భవన నిర్మాణానికి అనుకూలమైన పరిస్థితులు లేనప్పటికీ 10 అడుగుల రోడ్డు పక్కన ప్లాన్‌కు మించి దర్జాగా ఫ్లోర్‌లు వేసేస్తున్నాడు.



ఇందిరానగర్‌లో భవనంపై అనధికారికంగా నిర్మిస్తున్న అదనపు అంతస్తు

### సాలిపేట కొండవాలులో రెవెన్యూ స్థలం ఆక్రమణ

12వ వార్డు సాలిపేట కొండవాలు ప్రాంతంలోని రెవెన్యూ స్థలాన్ని ఓ టీడీపీ నాయకుడు ఆక్రమించి నిర్మాణం చేపడుతున్నాడు. ఇక్కడ గతంలో సుమారు 190 చదరపు గజాల విస్తీర్ణంలో రెండు ఇళ్లు ఉండేవి. వాటి వెనుక రెవెన్యూ స్థలం(కొండవాలు) ఉంది. ఇప్పుడా రెండిళ్ల స్థలంతోపాటు వెనుక ఉన్న రెవెన్యూకు చెందిన సుమారు 100 గజాల కొండవాలును కలుపుకుని నిర్మాణం చేపట్టేశాడు. సదరు వ్యక్తి ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు పేరు చెప్పుకోవడంతో రూరల్ రెవెన్యూ అధికారులు ఆ స్థలం అన్యాకాంతమైన దాని జోలికి వెళ్లలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

దీంతోపాటు వేరే ప్రాంతంలో సర్వే నంబర్‌తో ఈ భవన నిర్మాణం కోసం జీవీఎంసీ నుంచి ప్లాన్ తీసుకోవడం మరో విశేషం. ఈ కొండవాలు సర్వే నంబర్ 24లో ఉంది. ఈ భవనానికి మాత్రం సర్వే నంబర్ 67/3పై ప్లాన్ తీసుకొని నిర్మాణం చేపట్టాడు. ఇంత తతంగం జరుగుతున్నా అటు రూరల్ మండలం(చినగదిలి) రెవెన్యూ అధికారులు.. ఇటు జోన్–2 టౌన్ ప్లానింగ్ అధికారులు పట్టించుకోక పోవడంపై స్థానికులు ముక్కున వేలేసుకుంటున్నారు. ఉన్నతాధికారులు దృష్టి సారించి అనధికార నిర్మాణాలకు అడ్డుకట్ట వేయాలని, వాటిని పట్టించుకోని అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



సాలిపేటలోని ఆక్రమిత స్థలంలో టీడీపీ నాయకుడు నిర్మిస్తున్న భవనం

### మహిళలకు శిక్షణ ధ్రువపత్రాల అందజేత




ధ్రువపత్రాలు అందుకున్న మహిళలతో ఎమ్మెల్యే వెలగపూడి

ఎంవీపీకాలనీ: ధరణి సోషల్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో వివిధ రకాల వృత్తిపరమైన శిక్షణలు పూర్తి చేసుకున్న మహిళలకు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ధ్రువపత్రాలను అందజేశారు. ఎంవీపీ కాలనీలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మహిళలు ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి బ్యాంకు రుణాలు అందించేలా కృషి చేయాలని సొసైటీ ప్రతినిధులకు సూచించారు. పలువురు సొసైటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

### ప్రజా ఫిర్యాదులకు తక్షణ పరిష్కారం



పీజీఆర్ఎస్ కార్యక్రమం నిర్వహిస్తున్న జోన్-3 కమిషనర్ శివప్రసాద్

సీతమ్మధార: ఆశీలమెట్టలోని జోన్–3 కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి జోనల్ కమిషనర్ కె.శివప్రసాద్ రెండు అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల నుంచి అందిన ఫిర్యాదులను అధికారులు వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సమాచారాన్ని ఫిర్యాదుదారులకు ఎప్పటికప్పుడు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఈఈ గంగాధర్, డీఈ పద్మావతి, ఏఎంహెచ్‌వో డాక్టర్ భాస్కరరావు, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ వాణి, టీపీఎస్ నారాయణరావు, యూసీడీ విభాగం ఏపీడీ ఎల్.రాము, ఆర్‌వో పైడిరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

## తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి



వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్, కమిషనర్ విశ్వనాథన్‌కు వినతిపత్రం అందిస్తున్న సీఐటీయూ నాయకులు

విశాఖ సిటీ: వీఎంఆర్‌డీఏ పరిధిలో అక్రమంగా తొలగించిన 11 మంది కార్మికులను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని వీఎంఆర్‌డీఏ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్(సీఐటీయూ) గౌరవ అధ్యక్షుడు వి.కృష్ణారావు కోరారు. సోమవారం వీఎంఆర్‌డీఏ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 11 మంది కార్మికుల వయస్సు 60 ఏళ్లు పూర్తయ్యాయని డీఎఫ్‌వో అన్యాయంగా నిలిపేశారని తెలిపారు. ఎటువంటి నోటీసులు జారీ చేయకుండా తొలగించడాన్ని ఖండించారు. వీఎంఆర్‌డీఏలో సొసైటీ కార్మికులుగా 220 మంది పని చేస్తున్నారని, వీరికి ఈఎస్ఐ, పీఎఫ్, వేతనంతో కూడిన వారంతపు సెలవులు, లేబర్ హాలిడేస్, కార్మిక చట్టాలు అమలు చేయడం లేదని ఆరోపించారు. దినసరి వేతన కార్మికుడికి కష్టపడి పనిచేసే వరకు కొనసాగించాలని, లేనిపక్షంలో కార్మిక చట్టాలు వర్తింపు చేసి 30 ఏళ్లు పనిచేసిన కాలానికి సెటిల్‌మెంట్ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ప్రజాదర్బార్‌లో వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్, కమిషనర్ విశ్వనాథంలకు వినతిపత్రాన్ని అందజేశారు. దీనిపై వారు స్పందిస్తూ తగిన న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ మద్దిలపాలెం జోన్ కార్యదర్శి పి.వెంకటరావు, రాంబాబు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

## గ్యాస్ వినియోగదారుల భద్రతకు అధిక ప్రాధాన్యం



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న హెచ్‌పీసీఎల్ ప్రతినిధి, గ్యాస్ డిస్ట్రిబ్యూటర్లు, వినియోగదారులు

బీచ్‌రోడ్డు: వంటగ్యాస్ వినియోగదారుల భద్రతకు అధిక ప్రాధాన్యమివ్వాలని హెచ్‌పీసీఎల్ అసిస్టెంట్ సేల్స్ మేనేజర్ హరీష్ కోట సూచించారు. పెదవాల్తేరు చిన్మయ ఆశ్రమ ప్రాంగణంలో సోమవారం ఎల్పీజీ భద్రతపై గ్యాస్ వినియోగదారులకు అవగాహన పెంచడం కోసం మన వంటగది–మన బాధ్యత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భద్రతా నియమాలు కచ్చితంగా పాటిస్తే గ్యాస్ ప్రమాదాలు పూర్తిగా తగ్గిపోతాయన్నారు. సిలిండర్ తీసుకునేటప్పుడు తప్పనిసరిగా సీల్ తనిఖీ చేయాలని, సిలిండర్ కంటే గ్యాస్ స్టవ్ ఎక్కువ ఎత్తులో ఉండాలని సూచించారు. గ్యాస్ రెగ్యులేటర్ ఆఫ్ చేసిన తరువాత మాత్రమే స్టవ్ స్విచ్ ఆపాలన్నారు. ఎల్లప్పుడూ సురక్ష గ్యాస్ ట్యూబ్‌లను మాత్రమే వినియోగిస్తూ, లీకేజీ విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. అసిస్టెంట్ సప్లై ఆఫీసర్ మురళీనాథ్ మాట్లాడుతూ గ్యాస్ వినియోగంలో అప్రమత్తత ఎన్నో ప్రమాదాల నుంచి కాపడుతుందన్నారు. సెన్స్ ఆఫ్ డ్యూటీ క్యాంపెయిన్‌లో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో మహిళలకు వంటల పోటీ నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. గ్యాస్ డిస్ట్రిబ్యూటర్ల సీనియర్ సేల్స్ ఆఫీసర్ ఆదిత్య ప్రభు, రఘురాం గ్యాస్ కంపెనీ అధినేత కుమార్, మేనేజర్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణే ధ్యేయం



జాతీయ కాలుష్య నియంత్రణ దినోత్సవంలో పాల్గొన్న పలు విశ్వవిద్యాలయాల ప్రొఫెసర్లు

విశాఖ సిటీ: ఆంధ్రప్రదేశ్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్, జీవీఎంసీ, గ్రీన్ క్లైమేట్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం ఏపీపీసీబీ జోనల్ కార్యాలయంలో జాతీయ కాలుష్య నియంత్రణ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కృష్ణా యూనివర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ ఎస్.రామకృష్ణారావు, ఏయూ ఎన్విరాన్‌మెంట్ సైన్స్ విభాగం ప్రొఫెసర్ ఉదయ్ భాస్కర్‌రెడ్డి, సివిల్ ఇంజినీరింగ్ డిపార్ట్‌మెంట్ ప్రొఫెసర్ బాలప్రసాద్, ఏపీపీసీబీ మాజీ సీఈఈలు ఎస్.వి.భాస్కరరావు, కె.శ్రీరామమూర్తి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు చేపట్టాల్సిన చర్యలపై పలు సూచనలిచ్చారు. కాలుష్య నియంత్రణకు అనుసరించాల్సిన విధానాలను విశదీకరించారు. కార్యక్రమంలో శ్రావణ్ షిప్పింగ్ ఎండీ సాంబశివరావు, గ్రీన్ క్లైమేట్ ప్రతినిధి రత్నం, జేసీఈఈ డాక్టర్ పి.ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

### ఇగ్నో వార్షిక పరీక్షలు ప్రారంభం

ఎంవీపీకాలనీ: ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) విశాఖపట్నం ప్రాంతీయ కేంద్రం పరిధిలో 6 కేంద్రాల్లో పరీక్షలు సోమవారం ప్రారంభమైనట్లు కేంద్రం సంచాలకుడు డాక్టర్ ధర్మారావు తెలిపారు. 4 వేల మంది విద్యార్థులు ఆయా కేంద్రాల్లో పరీక్షలు రాస్తున్నట్లు పేర్కొన్నారు. రానున్న రోజుల్లో పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఇగ్నో వెబ్‌సైట్ నుంచి హాల్ టికెట్స్ డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. విద్యార్థులకు ఎలాంటి సందేహాలు ఉన్నా ఉషోదయ కూడలిలోని ఇగ్నో ప్రాంతీయ కేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు.

### పార్లమెంట్‌లో బీసీ బిల్లు ప్రవేశపెట్టాలి



మాట్లాడుతున్న లగుడు గోవింద్

ఏయూక్యాంపస్: దేశ వ్యాప్తంగా బీసీ సామాజిక వర్గంపై జరుగుతున్న అన్యాయాల నేపథ్యంలో ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లో బీసీ బిల్లు ప్రవేశపెట్టాలని ఆల్ ఇండియా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు లగుడు గోవిందరావు కోరారు. బీచ్ రోడ్డులోని ఒక హోటల్‌లో సోమవారం బీసీ నాయకులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 75 కోట్లకు పైగా ఉన్న బీసీ జనాభాకు అనేక రంగాల్లో తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. చట్ట సభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించాలని, జన గణనతోపాటు కుల గణన జరపాలని డిమాండ్ చేశారు. దేశ వ్యాప్తంగా బీసీ రక్షణ చట్టం ఏర్పాటు చేయాలన్నారు. దీనికి సంబంధించిన తీర్మానాన్ని ప్రధాని, రాష్ట్రపతి, పార్లమెంట్ స్పీకర్‌లకు పంపిస్తామని తెలిపారు. కార్యక్రమంలో బీసీ నాయకులు వరుదు రాజ్‌కుమార్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### ఉత్సాహంగా టీటీ ర్యాంకింగ్ పోటీలు

విశాఖ స్పోర్ట్స్: స్టేట్ మాస్టర్స్ ర్యాంకింగ్ టేబుల్ టెన్నిస్ టోర్నీ ఆదివారం ఉత్సాహంగా సాగింది. జిల్లా మాస్టర్స్ టీటీ వెల్ఫేర్ సంఘం ఆధ్వర్యంలో రైల్వే స్టేడియంలో 40+ నుంచి 70+ ఏళ్ల వారికి పోటీలు నిర్వహించారు. 40+ మెన్ సింగిల్స్ ఫైనల్‌లో శ్రీకాంత్ రాజ్‌పై ఆర్‌వీఎస్ రాజు, వుమెన్ సింగిల్స్ ఫైనల్స్‌లో రామలక్ష్మిపై నిర్మల విజయం సాధించారు. 50+ మెన్ సింగిల్స్ ఫైనల్‌లో డీవీ శర్మపై జీవీఎస్ రామారావు, 60+ మెన్ సింగిల్స్ ఫైనల్‌లో కృష్ణమూర్తిపై అబ్బాస్ గెలుపొందారు. 65+ మెన్ సింగిల్స్ ఫైనల్‌లో నారాయణమూర్తిపై రామారావు, 70+ మెన్స్ సింగిల్స్ ఫైనల్‌లో గిరిధర్‌పై గంగాధరరావు విజయం సాధించారు.40+ మెన్ డబుల్స్ ఫైనల్‌లో రామారావు–శర్మ జోడీపై శ్రీకాంత్–పవన్ జోడీ గెలుపొందింది. 60+ మెన్ డబుల్స్ ఫైనల్‌లో రామారావు–సత్యం జోడీపై అబ్బాస్–రామ్‌మోహన్ జోడీ విజయం సాధించింది.

## భక్తిశ్రద్ధలతో పోలి పాడ్యమి



పెదగదిలి శివాలయం వద్ద కృత్రిమ కొలనులో దీపాలు వదులుతున్న మహిళలు



పాత వెంకోజీపాలెం రామాలయం వద్ద కొలనులో దీపాలు వదులుతున్న మహిళలు



అర్చకులకు వాయినం ఇస్తున్న భక్తులు

ఆరిలోవ: కార్తీక మాసం ముగిసిన సందర్భంగా సోమవారం మహిళలు భక్తిశ్రద్ధలతో పోలి పాడ్యమి పూజలు నిర్వహించారు. ఆరిలోవ ప్రాంతంలోని శివాలయాలను వేకువజామున దర్శించుకుని పూజలు చేశారు. ఆలయాల్లో నిర్వాహకులు ఏర్పాటు చేసిన కృత్రిమ కొలనుల్లో అరటి దవ్వలలో దీపాలు వెలిగించి తెప్పలుగా విడిచిపెట్టారు. కొందరు ఇళ్ల వద్దే పెద్ద ప్లేట్లలో నీరుపోసి వాటిలో తెప్పలు విడిచిపెట్టి దీపాలు వెలిగించారు. పెదగదిలి, ఆరిలోవ శివాజీనగర్–2, నెహ్రూనగర్ ప్రాంతాల్లో కృత్రిమ నీటి కుండీల వద్ద భక్తులు తాకిడి నెలకొంది. పెదగదిలి శివాలయంలో సామూహిక పూజలు, అభిషేకాలు చేశారు.

**ఆలయాల్లో ఘనంగా దీపారాధనలు**

మద్దిలపాలెం: కొత్త వెంకోజీపాలెం శ్రీ గౌరీ జ్ఞానలింగేశ్వరాలయంలో పోలి పాడ్యమి పూజలు ఘనంగా నిర్వహించారు. అర్చకులు అరవెల్లి సూర్యప్రకాస్ శర్మ, సుబ్రహ్మణ్యశాస్త్రి, బాలభాస్కరశర్మ ప్రత్యేక పూజలు చేశారు. వారికి భక్తులు వాయినాలు అందజేశారు. వేకువజాము నుంచి మహిళలు అరటి దిబ్బలపై 1001, 501, 108 దీపాల ఒత్తులను ఉంచి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన కొలనులో వదిలారు.

- పాత వెంకోజీపాలెం సీతారామ సేవా సంఘం ఆధ్వర్యంలో రామాలయం వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక కొలనులో భక్తులు దీపాలు విడిచిపెట్టారు. అర్చకులు రంపా రామ్మోహన్ శర్మ, రంపా మురళి భక్తుల నుంచి వాయినాలను తీసుకున్నారు.
- పీతలవానిపాలెంలో రాజరాజేశ్వరి రామలింగేశ్వర స్వామి ఆలయం వద్ద కొలనులో భక్తులు దీపాలు వదిలి పూజలు చేశారు.

## బార్లు, పబ్‌ల్లో విస్తృత తనిఖీలు



బార్‌లో తనిఖీలు చేస్తున్న పోలీస్ అధికారులు

అల్లిపురం: నగర పరిధిలో బార్లు, పబ్‌ల్లో ఆదివారం రాత్రి పోలీసులు తనిఖీలు నిర్వహించారు. 150 మంది సిబ్బంది 46 బృందాలుగా 56 బార్లు, పబ్‌లపై తనిఖీలు చేపట్టారు. తనిఖీల్లో ఎక్సైజ్ లైసెన్స్ లేని 4 రెస్టారెంట్లు, ఫుడ్ లైసెన్స్, ట్రేడ్ లైసెన్స్ లేని 3 రెస్టారెంట్లు, పార్కింగ్ స్థలం లేని 12 రెస్టారెంట్లు, ఫైర్ సేఫ్టీ లేని 14 బార్ అండ్ రెస్టారెంట్లు, సీసీ టీవీలేని 2 రెస్టారెంట్లు, గృహ వినియోగ సిలిండర్లు వాడుతున్న 3 రెస్టారెంట్లు, ఎక్కువ ధరకు మద్యం అమ్ముతున్న 12 రెస్టారెంట్లను గుర్తించి.. తదుపరి చర్యలు నిమిత్తం సంబంధిత విభాగాలకు నివేదిక అందించారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా వ్యవహరించినా, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా చట్టపరమైన చర్యలు తప్పవని ఈ సందర్భంగా నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి హెచ్చరించారు. ఎటువంటి ఫిర్యాదులైన 79950 95799 నంబర్‌కు ఫోన్ చేసి లేదా వాట్సాప్ ద్వారా తెలియజేయాలని కోరారు.

## వేమన.. వేదన



బీచ్ రోడ్డులో రంగులు వెలిసిపోయిన యోగి వేమన విగ్రహం

ఏయూక్యాంపస్: బీచ్ రోడ్డులో ఉన్న యోగి వేమన విగ్రహం రంగులు వెలిసిపోయింది. ప్రజాకవిగా చరిత్రలో చిరస్థాయిగా నిలిచిన యోగి వేమన విగ్రహం నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తోంది. తాను రాసిన పద్యాలతో సమాజంలో నైతిక విలువలు, మూఢ నమ్మకాలు, కుల వివక్షత వంటి అంశాలపై చైతన్యం తీసుకొచ్చిన వేమన విగ్రహాన్ని గతంలో బీచ్ రోడ్డులో ఏర్పాటు చేశారు. మత్స్య దర్శిని పక్కనే ఉన్న ఈ విగ్రహం ప్రస్తుతం రంగులు వెలిసి కళ కోల్పోయింది. ఈ విగ్రహం పరిస్థితి సాహితీకారులు, సందర్శకులను వేదనకు గురిచేస్తోంది. అధికారులు స్పందించి వేమన విగ్రహానికి పూర్వ వైభవం తీసుకురావాలని వారంతా కోరుతున్నారు.